ఆధునిక వైద్యం అందేనా..?

- అధ్వానంగా ప్రభుత్వ దవాఖాన భవనం
- పైకప్పు పెచ్చులూడుతున్న వైనం
- శిలాఫలకానికే పరిమితమైన నూతన భవన నిర్మాణం
- పాత భవనంలో వసతుల లేమి

యాచారం ప్రభుత్వ దవాఖాన

యాచారం, ఆగస్టు 10 : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దవాఖాన భవనం రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నది. ప్రస్తుత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అటు వైద్యులు ఇటు రోగులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. శిథిలావస్థ భవనానికి ఎన్నిసార్లు మరమ్మతులు చేయించినా చివరికి అదే దుస్థితికి చేరుకుంటుంది. భవనం శిథిలావస్థకు చేరడంతో వసతులు కరువై నిత్యం రోగులు నరకం చవిచూస్తున్నారు. నూతన భవనం అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఆధునిక వైద్యం అందడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా దవాఖానను దర్శించుకునే పాలకులే కరువయ్యారు.

యాచారం మండలంతో పాటు మంచాల, ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్లు, మర్రిగూడ, చింతపల్లి, కడ్తాల మండలాల ప్రజలకు ఈ 30 పడకల దవాఖాన అప్పట్లో ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు పెచ్చులూడిపోయి కింద పడుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అప్పటి కలెక్టర్ అమయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ భవనాన్ని సందర్శించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

వసతులు కరువు..

యాచారం ప్రభుత్వ దవాఖాన ఒకప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉండేది. ప్రస్తుతం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఏర్పాటు చేశారు. వైద్య విధాన పరిషత్ ఆధీనంలో పనిచేస్తున్న యాచారం ప్రభుత్వ దవాఖాన పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా పేరు మారినా రూపురేఖలు మాత్రం మారలేదు. 14 మంది స్టాఫ్ నర్స్‌లు, 14 మంది వలంటీర్లను నియమించినప్పటికీ బిల్డింగ్ సౌకర్యవంతంగా లేకపోవడంతో పేదలకు ఆధునిక వైద్యం అందని ద్రాక్ష గానే మిగిలిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. భవనానికి కనీసం కిటికీలు లేకపోవడంతో వర్షాలకు, రాత్రిపూట చలికి రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. ఆయుర్వేద దవాఖానకు ప్రత్యేక భవనం లేకపోవడంతో నూతన భవనం నిర్మించి అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దవాఖాన పైకప్పు పెచ్చులూడుతున్న దృశ్యం

నూతన భవనం నిర్మించాలి

యాచారం ప్రభుత్వ దవాఖాన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నది. భవనం పైకప్పు పెచ్చులూడిపోయి ఎవరి మీద పడి ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. దవాఖాన నూతన భవన నిర్మాణానికి కేటాయించిన కోటి 50 లక్షల నిధులతో పేద ప్రజల సౌకర్యార్థం వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలి. అన్ని రకాల ఆధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి, మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలి

- మహ్మద్ కాజా మొయినుద్దీన్, యాచారం

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 10 : షాద్‌నగర్ పట్టణంలోని 7వ వార్డు ఈశ్వర కాలనీలోని అభ్యాస్ స్కూల్‌లో పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మహిళలకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు యోగా సమితి అధ్యక్షుడు శశిధర్ తెలిపారు. సాయంత్రం 5:30 నుంచి 7గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత యోగా శిక్షణ తరగతులను మహిళలందరూ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, ఆగస్టు 10 : మండలంలోని సీతారాంపూర్ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి (కమిటీ)ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 31వ తేదీలోపు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయం, హైదరాబాదులో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి
విరాళం

చేవెళ్ల రూరల్, ఆగస్టు 10 : పామెన గ్రామంలో నిర్మిస్తున్న వీరభద్ర ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. శనివారం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డి ఆలయ నిర్మాణంలో భాగంగా రూ.51 వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, గ్రామస్తులు రాములు, కొమురయ్య, నరేందర్‌రెడ్డి, రాజుగౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 10 : మండల కేంద్రంలోని సంజయ్‌గాంధీ మెమోరియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సులకు మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 12న ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బి నాగమునినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. పాలిసెట్ హాల్ టికెట్, పాలిసెట్ ర్యాంక్ కార్డు, ఎస్ఎస్ఎస్సీ మెమో, టీసీ, స్టడీ/రెసిడెన్షియల్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఇతర ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను జత చేయాలని పేర్కొన్నారు. మెరిట్ జాబితాను 12న ఉదయం 11 గంటలకు ప్రదర్శించి సీట్ల కేటాయింపు ప్రక్రియ ముగిసే వరకు స్పాట్ కొనసాగుతుందన్నారు. స్పాట్‌కు వచ్చే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు మూడు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు. ఇందుకోసం టీఎస్ పాలిసెట్ -2023 అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 300, ఇతరులు రూ.600 చెల్లించాలని తెలిపారు. టీఎస్ పాలిసెట్ 2023 అర్హత లేని/ అప్లై చేయని అభ్యర్థులు ఎస్సి, ఎస్టీలకు రూ.550, ఇతరులు రూ. 1100, ఫీజు చెల్లించాలని వివరించారు. సీటు కేటాయించిన వెంటనే రూ. 5080ట్యూషన్ ఫీజు చెల్లించాలని, లేని పక్షంలో కేటాయించిన సీటును రద్దుచేసి తదుపరి అభ్యర్థికి ఆ సీటు కేటాయిస్తామని తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కడ్తాల్, ఆగస్టు 10: మండల పరిధిలోని మైసిగండిలోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్‌లో శనివారం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళానాన్ని నిర్వహించారు. కడ్తాల్ గ్రామంలోని పాఠశాల 2006-07 బ్యాచ్‌కు చెందిన 15 మంది విద్యార్థులు పాల్గొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాధవులు, శివశంకర్, వినోద్, రాకేశ్, మధు, బాలగౌడ్, గణేశ్, మహేశ్, నందిని, రమణి, మంజుల, కల్యాణి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా బీఆర్ఎస్వీ నేత జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శిశుపాల్ శనివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును ఆయన నివాసంలో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్‌కుమార్, మాజీ మంత్రి రావుల చంద్ర శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు రాజేశ్‌నాయక్, దిలీప్‌రెడ్డి, భరత్‌గౌడ్, శ్రీకాంత్, కార్తీక్, తేజ, నందు పాల్గొన్నారు.

- చేవెళ్ల రూరల్, ఆగస్టు 10

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

షాబాద్, ఆగస్టు 10 : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్, భాస్కర హాస్పిటల్, శ్రీ బాలాజీ దంత వైద్యశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 80 మంది కి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం జరిగిందని తెలిపారు. కీళ్ల, సాధారణ, మానసిక, చిన్నపిల్లలకు సంబంధించిన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, వైద్యుడు క్రాంతి, సిబ్బంది రమేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

స్వచ్ఛదనంతో శుభ్రంగా వార్డులు

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 10 : స్వచ్ఛదనం పచ్చదనంతో మున్సిపాలిటీలోని పలు వార్డులు శుభ్రంగా మారాయి. శనివారం షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 7వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది చెత్తాచెదారాన్ని తొలగించారు. స్థానికులు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం వేయొద్దని, వార్డును పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

కడ్తాల్, ఆగస్టు 10: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలని తెలిపారు. అంతకు ముందు ఆలయంలో అభిషేకాలు, చండూర ధారణ, హన్‌మాన్ చాలీసా, సత్యనారాయణస్వామి వ్రతాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, శంకర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు నర్సింహ, సుధీర్‌రెడ్డి, రాజాగౌడ్, కృష్ణయ్య, జగన్‌గౌడ్, కేశవులు, శ్రీరాములు, కుమార్, రామకృష్ణ, నరేశ్, గోప్యా, జంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

కడ్తాల్, ఆగస్టు 10: అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని, సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకే ఉందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన గూడూరు రవీందర్‌రెడ్డి ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందారు. ఈ మేరకు శనివారం కడ్తాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను పలువురు నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమన్నారు. పాఠశాల అభివృద్ధితోపాటు, గ్రామాభివృద్ధికి రవీందర్‌రెడ్డి విశేష సేవలు అందించారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, కేశవులుగౌడ్, సుధాకర్‌గౌడ్, రమేశ్ గౌడ్, జంగయ్య, మల్లయ్య, శివ, మహేశ్, శ్రీను, శ్రీకాంత్, భానుగౌడ్, కొండల్, నాగులు, హరీశ్, కార్తిక్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన హెచ్ఎం రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

చేవెళ్ల టౌన్, ఆగస్టు 10: బీసీ వసతి గృహంలో చదువుతున్న పేద విద్యార్థులకు చేయూతనిచేందుకు దాతలు ముందుకు రావాలని చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి అన్నారు. చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చేవెళ్ల గ్రామానికి చెందిన గుత్తి మల్లేశ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో బీసీ వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చేవెళ్ల గ్రామ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, గుడిపల్లి శ్రీకాంత్‌రెడ్డి రూ. 45వేల చెక్కును ఉపాధ్యాయుడికి అందజేశారు. వీరి వెంట మండల మహిళా అధ్యక్షురాలు సమతావెంకట్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, నాయకులు శ్రీరామ్ రెడ్డి, నర్సింహులు, మల్లేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

షాబాద్, ఆగస్టు 10: పేద కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని షాబాద్ మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్ పాషా అన్నారు. మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన పేదింటి మహిళ అంజమ్మ కూతురు పెళ్లికి శనివారం చాంద్ పాషా తన వంతు సహాయంగా రూ.11వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాదయ్య, గ్రామ మాజీ సర్పంచులు పి. దర్శన్, శేఖర్, బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు కొండ రాజుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్, గ్రామస్తులు ఆచారి, రామచంద్రయ్య, జంగయ్య, ఆంజనేయులు, ఇస్తారయ్య ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

నందిగామ, ఆగస్టు 10: నందిగామ మండలం మేకగూడ గ్రామం నుంచి దర్గా రోడ్డు వరకు గల రోడ్డు గుంతలుగా ఏర్పడటంతో గ్రామ యువ నాయకులు రాజు సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, రవి, రమేశ్, రాజు, గౌస్ పాషా, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలి

మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. రంగారెడ్డి జిల్లా మత్స్య పారిశ్రామిక ఏడీ నర్సింహరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సమస్యలను వివరించారు. నాణ్యమైన చేపపిల్లలను అందజేయాలని కోరారు. వలలు, మోపెడ్‌ను అందజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లింగం ముదిరాజ్, వెంకటేశ్ ముదిరాజ్, ఎడ్ల ఉదయ్ ముదిరాజ్, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, బాలక్రిష్ణ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, కృష్ణాముదిరాజ్, సత్తయ్య ముదిరాజ్, క్రిష్ణ య్య ముదిరాజ్, రాజు , సుదర్శన్, రవీందర్ పాల్గొన్నారు.

- కందుకూరు

యోగా చేద్దాం రండి.. కార్యక్రమంలో పాల్గొన్న ఇస్మాయిల్ గురూజీ

యోగాతో మానసిక ప్రశాంతత

ఆర్కేపురం, ఆగస్టు 10 : గురు నిలయం ఆధ్వర్యంలో శ్రీ షిరిడి సాయి అష్టంగా నిత్య యోగ సాధన కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటి నుంచి విశేషమైనటువంటి స్పందన లభిస్తుందని ప్రముఖ యోగ గురువు స్వధర్మయోగి శ్రీ ఇస్మాయిల్ గురూజీ అన్నారు. నిత్య యోగ సాధన కేంద్రంలో ప్రతి రోజు యోగా చేద్దాం రండి మాతో కలవండి అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రకరకాల మానసిక శారీరక ఆధ్మాత్మిక అనారోగ్యాల నుంచి బయటపడడానికి పూర్వ కాలం రుషులు మనకు అందించిన యోగ విద్య చాలా ఉపయోగపడుతుందన్నారు. లోటస్ ల్యాబ్ పబ్లిక్ స్కూల్‌లో ప్రతి రోజు ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ నిత్య యోగ సాధన నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు ఆన్‌లైన్ ద్వారా ప్రతి రోజు ఉదయం 6 : 30 నుంచి 7:30 గంటల వరకు ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూర మల్సూర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కవిత రెడ్డి, మంజుల రెడ్డి ఉన్నారు.

యువకుడి అదృశ్యం

నరేష్(ఫైల్)

శంషాబాద్ రూరల్, ఆగస్టు 10 : యువకుడు అదృశ్యమైన ఘటన శనివారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మదన్‌పల్లి కొత్తతండాకు చెందిన కొప్పి శెట్టి నరేష్(24) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 8న రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయాడు. మరుసటి రోజు ఉదయం 4 గంటల సమయంలో చూస్తే నరేష్ కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఫౌండేషన్ చైర్మన్ వెంకట్‌రెడ్డి హాజరై కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

కొండాపూర్, ఆగస్టు 10 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాకారులు కూచిపూడి, భరతనాట్యం, మోహినీయాట్టం నృత్యాలతో అలరించారు. అర్చన గుత్తి తన శిష్య బృందంతో కలిసి బ్రహ్మాంజలి, అదివో అల్లదిగో, శివ పంచాక్షరీ కృష్ణ జనన శబ్దం, గోవర్ధన గిరిధరి, ధనశ్రీ తిల్లాన, స్వాగతం కృష్ణ అంశాలను కూచిపూడి నృత్యరీతులలో ప్రదర్శించి ఆకట్టుకోగా, ధనీషా ధనపాల్ మోహినీయాట్టం, ఆషిక షణ్ముగం భరతనాట్య నృత్య రీతులతో ఆకట్టుకున్నారు. ప్రముఖ నాట్య గురువు నిర్మల ప్రభాకర్, వీఆర్ కల్చరల్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మణికొండ, ఆగస్టు 10: ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పటికప్పుడు నెరవేరుస్తున్నామని నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్ శ్రీకాంత్ అన్నారు. శనివారం రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ 6వ వార్డులో సీసీ రోడ్లు లేకపోవడంతో గోతులమయంగా మారాయన్నారు. సమస్యను పరిశీలించి పరిష్కారమయ్యేలా రూ. 15 లక్షలు మంజూరు చేయించామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి

దుకాణాలను తొలగించాలి

మన్సూరాబాద్, ఆగస్టు 10: జాతీయ రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. చింతలకుంట అండర్‌పాస్ రోడ్డు, సరస్వతి నగర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న దర్గా వద్ద జాతీయ రహదారిపై కొందరు దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు చేసిన ఫిర్యాదుల మేరకు శనివారం కార్పొరేటర్ పర్యటించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. 25 కాలనీలకు రాకపోకలు సాగించే మార్గంలో దర్గా స్థలంగా పేర్కొంటూ రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఆక్రమణలను తొలగించకపోతే కాలనీలవాసులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ధర్మారావు, మురళీగౌడ్, సతీశ్ కుమార్, సత్యప్రియ, వెంకటరమణ, ప్రవీణ్, వెంకటేశ్, జగన్, నర్సింహ గౌడ్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులు

కందుకూరు, ఆగస్టు 10 : ఉపాధ్యాయులు మార్గదర్శకులు అని బాచుపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విధులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రామక్రిష్ణరెడ్డి, వాణిశ్రీ, ధనలక్ష్మి, రాజేశ్వర్, గోపాల్‌కు ఆత్మీయ బదిలీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారిని శాలువా, పూల దండలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణ తప్పవని పేర్కొన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మధు, జంగయ్య, రమేశ్, సూర్యప్రభ, మల్లికార్జున్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.